యాదగిరిగుట్టలో వైభవంగా తిరువీధి సేవోత్సవం

ఆలయంలో గొంగిడి దంపతులకు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 6 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారికి తిరువీధి సేవ అత్యంత వైభవంగా సాగింది. మంగళవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించారు. స్వామివారిని గరుఢ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి తిరు మాఢవీధుల్లో ఊరేగించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజ రూప దర్శనంలో స్వయంభూ నారసింహ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారికి కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి దర్బార్ సేవ చేపట్టారు. రాత్రి ప్రధానాలయ ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన జరిగాయి. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 14,49,164 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహ మూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

వైభవంగా ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్రోత్సవం

యాదగిరిగుట్ట దేవస్థానంలో ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్రోత్సవం వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం అమ్మవారికి తిరుమంజనం, స్నపనం గావించారు. సాయంత్రం అమ్మవారి పురప్పాట్ సేవను ఊరేగించారు. ఆలయ ముఖ మండపంలో పారాయణందారులు దివ్యప్రబంధ ప్రసుర పఠనాలను పఠించారు. బుధవారం తిరునక్షత్రోత్సవం సందర్భంగా అమ్మవారికి విశేష ఆరాధన చేపట్టనున్నారు. అమ్మవారి పురప్పాట్ సేవ ఆలయ మాఢవీధుల్లో ఊరేగించనున్నారు. అనంతరం ఆరగింపు చేపట్టి ఉత్సవాలకు ముగింపు పలుకనున్నారు.

ఆకుపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సునీత దంపతులు

యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంలో క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామి ఆకుపూజలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, టెస్కాబ్ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం స్వయంభూ పంచ నారసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆలయ సంప్రదాయరీతిలో వేద ఆశీర్వచనం చేశారు.

యాదగిరిగుట్ట దేవస్థానంలో ఉద్యోగుల బదిలీలు

- మొదటి విడుతలో 20 మంది బదిలీ
- రెండో విడుతలో మరో ఆరుగురు బదిలీ తప్పనిసరి

యాదగిరిగుట్ట, ఆగస్టు 6 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పనిచేసే 26 మంది ఉద్యోగులను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ బదిలీ చేశారు. ఇందులో ఇద్దరు ఏఈఓలు, ఆరుగురు సూపరింటెండెంట్లు, తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లు, ఒక ఏఈ, డీఈఈ ఉన్నారు. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి విడుతలో భాగంగా మంగళవారం 20మంది అధికారులు బదిలీపై వెళ్లారు. మరో ఆరుగురు ఉద్యోగులు రెండో విడుతలో వెళ్లనున్నారు. 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. యాదగిరిగుట్ట నుంచి కొమురవెల్లి, వేములవాడ, కొండగట్టు, భద్రాచలం తదితర దేవస్థానాలకు పలువురు మినిస్టీరియల్ అధికారులు బదిలీపై వెళ్లారు. 15 ఏండ్ల తర్వాత ప్రభుత్వం బదిలీలు చేపట్టింది. ప్రస్తుతం బదిలీపై వెళ్లే దేవస్థాన అధికారులు మూడ్రోజుల్లో బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఇద్దరు ఏఈఓలు..

యాదగిరిగుట్ట దేవస్థానంలో సుదీర్ఘంగా పనిచేసిన ఏఈఓలు బదిలీ అయ్యారు. మొత్తం నలుగురు ఏఈఓలు గట్టు శ్రవణ్‌కుమార్, గజవెల్లి రమేశ్‌బాబు, గజవెల్లి రఘు, దూశెట్టి కృష్ణ, రామ్మోహన్ ఉండగా.. ఇందులో సుదీర్ఘ కాలం పనిచేసిన గట్టు శ్రవణ్‌కుమార్, గజవెల్లి రమేశ్‌బాబును వేములవాడ దేవస్థానానికి బదిలీ చేశారు. వీరి స్థానంలో వేములవాడ ఏఈఓ పి.నవీన్‌కుమార్, భద్రాచలం దవేస్థానం ఏఈఓ భవాణి రామకృష్ణ బదిలీపై వచ్చారు.

నలుగురు సూపరింటెండెంట్లు..

యాదగిరిగుట్ట దేవస్థానంలో ఆరుగురు సూపరింటెండెంట్లకు స్థానచలనం కలుగగా.. మొదటి విడుతలో నలుగురు సూపరింటెండెంట్లు బదిలీపై వెళ్లారు. ఇందులో సుదీర్ఘ కాలం పనిచేసిన వి.వెంకట ప్రసాద్, వి.శ్రీలత, జి.అశోక్‌ను వేములవాడ దేవస్థానానికి, దొమ్మాట సురేందర్‌రెడ్డిని కొమురవెల్లి ఆలయానికి బదిలీ చేశారు. మరో ఇద్దరు ఆర్.విజయకుమార్, ఎం.రాజన్‌బాబు రెండో విడుతలో బదిలీ కానున్నారు. వీరి స్థానంలో వేములవాడ దేవస్థాన సూపరింటెండెంట్ ఎన్.మల్లేశ్, జి.శ్రీనివాస్, కె.నటరాజు, భద్రాచలం దేవస్థాన సూపరింటెండెంట్ కె.నిరంజన్‌కుమార్ బదిలీపై రానుండగా.. మరో ఇద్దరు సూపరింటెండెంట్లు రావాల్సి ఉంది.

ఐదురుగు సీనియర్, 8మంది జూనియర్ అసిస్టెంట్లు..

యాదగిరిగుట్ట దేవస్థానంలో పనిచేస్తున్న ఏడుగురు సీనియర్ అసిస్టెంట్లు బదిలీ కాగా.. మొదటి విడతలో ఐదుగురు బదిలీపై వెళ్లారు. మరో ఇద్దరు రెండో విడుతలో బదిలీ కానున్నారు. 9మంది జూనియర్ అసిస్టెంట్లలో మొదటి విడుతలో 8 మంది బదిలీపై వెళ్లారు. రెండో విడుతలో మరొకరు బదిలీ కానున్నారు.

పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

పెద్దతండాలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి సురేశ్‌బాబు

తుర్కపల్లి, ఆగస్టు 6 : పారిశుధ్య నిర్వహణ పనులను గ్రామాల్లో పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి సురేశ్‌బాబు అన్నారు. పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్ద తండా గ్రామంలో మంగళవారం పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఝాన్సీ లక్ష్మీబాయి, మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

వలిగొండ : గోకారంలో మొక్క నాటుతున్న మండల ప్రత్యేకాధికారి జగన్నాథం

వలిగొండ, ఆగస్టు 6 : నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని మండల ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథం అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోకారం గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మంచినీటి ట్యాంకులు, పశు వైద్యశాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటువ్యాధుల నివారణకు చెత్తాచెదారం తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు నీరు నిల్వకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'రజక ఫెడరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలి'

మోటకొండూర్, ఆగస్టు 6 : రజకులకు వెయ్యి కోట్లు కేటాయించి, రజక ఫెడరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని రజక సంఘాల రాష్ట్ర కో ఆర్డినేటర్ వడ్డబోయిన శ్రీధర్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకులను ఆదుకునేలా ఫెడరేషన్‌కు చైర్మన్, సభ్యులను నియమించి ప్రతి పథకాన్ని రజకులకు అందేలా చూడాలన్నారు. 50 ఏండ్లు నిండిన రజకులకు పెన్షన్, సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. సమావేశంలో రజక సంఘం మండల నాయకులు వడ్డబోయిన శ్రీనివాస్, వడ్డబోయిన వెంకటేశ్, గణేశ్, శ్రీను, రమేశ్, ఇస్తారి పాల్గొన్నారు.

జయశంకర్ సార్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్
- జిల్లా వ్యాప్తంగా ఆచార్య జయంతి వేడుకలు

భువనగిరి కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 6 : తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ఆచార్య జయశంకర్ సార్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్ అన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జయశంకర్ రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారన్నారు. కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి జగన్మోహన్‌ప్రసాద్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శివ రామకృష్ణ, ఇన్‌చార్జి డీఈఓ ప్రశాంత్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ పార్థసింహారెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా జయంతి

భువనగిరి అర్బన్ : తెలంగాణ సిద్ధాంతకర్త, మలిదశ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య జయశంకర్ సార్ 90వ జయంతిని జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫ్లెక్సీలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో జయశంకర్ సార్ చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు, కమిషనర్ పి.రామానుజులరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

వలిగొండ : మండల కేంద్రంతోపాటు నాగారంలో జయశంకర్ సార్ విగ్రహానికి, సంగెం గ్రామంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

ఆలేరు రూరల్ : మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జయశంకర్ సార్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాజాపేట : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని గ్రామ గ్రామాన జయశంకర్ సార్ జయంతి నిర్వహించారు. మండల కేంద్రంలోని సరస్వతి విద్యాలయంలో జయశంకర్ సార్ జయంతి సందర్భంగా పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు.

తుర్కపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీఓ నర్సయ్య, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో జయశంకర్ సార్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు.

చౌటుప్పల్ : మున్సిపల్ కార్యాలయంలో జయశంకర్ సార్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళుర్పించి సేవలను కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్‌నాయక్, మేనేజర్ లింగయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు. తంగడపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ ముటుకుల్లోజు దయాకరాచారి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు.

మోత్కూరు : మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి పి.యాదయ్య జయశంకర్ సార్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీఓ అలీ, కార్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు టి.గోపాల్‌రెడ్డి ప్రొఫెసర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. బీఆర్ఎస్ మండల కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పించి ఆయన సేవలను కొనియాడారు.

యాదగిరిగుట్ట : మండలంలోని మల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు.

మోత్కూరు : జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భువనగిరి అర్బన్ : జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వలిగొండ : నాగారంలో జయశంకర్ విగ్రహం వద్ద..

చౌటుప్పల్ : తంగడపల్లిలో జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

రాజాపేట : పాముకుంట హైస్కూల్‌లో జయశంకర్ సార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

భూదాన్ పోచంపల్లిలో జయశంకర్ సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ గంగాధర్

ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 6 : సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జడ్పీ సీఈఓ శోభారాణితో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు అయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో జ్వర సర్వే చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్, మండల వైద్యాధికారి శ్రీవాణి, పల్లె దవాఖాన డాక్టర్లు రంజిత్, సందీప్, క్లస్టర్ ఆఫీసర్ పోతరెడ్డి, వైద్య సిబ్బంది ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలను చైతన్యం చేయాలి : డీఎంహెచ్‌ఓ

వలిగొండ : పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్యాధికారి మనోహర్

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 6 : కాలానుగుణంగా సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, స్వచ్ఛదనం – పచ్చదనం విశిష్టతను తెలియజెప్పాలని డీఎంహెచ్‌ఓ మనోహర్‌రావు అన్నారు. మండలంలోని బొల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ జ్వర సర్వే చేసి స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఆరోగ్యవంతమైన జీవన విధానానికి అనుసరించాల్సిన విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా టీకాల అధికారి డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి పిల్లవాడికీ వ్యాక్సినేషన్ అందించాలని, చిన్నారులు తల్లి పాలు తీసుకునేలా ఆరోగ్య విద్య అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి మధుసూదన్‌రెడ్డి, సాయిరెడ్డి సత్యనారాయణ, సత్యవతి, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ కొండా మురళీమోహన్, పర్యవేక్షక సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వలిగొండ పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

వలిగొండ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ మనోహర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని, విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా స్వచ్ఛదనం, పచ్చదనం పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రామకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

బోడ బాలరాజు

బోడ నవీన్

ఏఈఈ ఉద్యోగాలు సాధించిన అన్నాదమ్ములు

రామన్నపేట, ఆగస్టు 6 : టీజీపీఎస్‌సీ ఇటీవల ప్రకటించిన ఏఈఈ ఫలితాల్లో అన్నాతమ్ముడు రాష్ట్ర స్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించి రోడ్లు, భవనాల శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్ ఉద్యోగాలు సంపాదించారు. మండలంలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన బోడ కిష్టయ్య, కళమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. చేనేత కుటుంబానికి చెందిన వారు నేత పనులు చేస్తూ పిల్లలను చదివించారు. కాగా, ఇటీవల ప్రకటించిన టీజీపీఎస్‌సీ ఫలితాల్లో వారి కుమారులు నవీన్ రాష్ట్ర స్థాయిలో 14వ ర్యాంకు, బాలరాజు 62వ ర్యాంకు సాధించారు. ఇద్దరికీ ఆర్ అండ్ బీ శాఖలో ఏఈఈ ఉద్యోగాలు వచ్చాయి. వారిని బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

ఏఈఈ ఉద్యోగానికి రైతుబిడ్డ ఎంపిక

యాదగిరిగుట్ట, ఆగస్టు 6 : సాధారణ రైతు కుటుంబానికి చెందిన కొమ్మరాజు భాస్కర్ రోడ్లు, భవనాల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) ఉద్యోగం సాధించాడు. మండలంలోని మల్లాపురం గ్రామ పంచాయతీకి చెందిన కొమ్మరాజు బాలనర్సింహ, లలిత దంపతులకు ముగ్గురు సంతానం. వారు తమకు ఉన్న కొద్దిపాటి వ్యవసాయం చేస్తూ రజక వృత్తిని కొనసాగిస్తూ ముగ్గురు పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కొడుకు భాస్కర్ పట్టుదలతో చదవి ఇటీవల విడుదలైన టీజీపీఎస్‌సీ ఏఈఈ ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తన తల్లిదండ్రుల సహకారంతో పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించానని భాస్కర్ తెలిపాడు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, ఆగస్టు 6 : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మంగళవారం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల మనుగడకు మొక్కలు నాటి పెంచాలన్నారు. పచ్చదనం పెంపొందించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నీళ్లతండా గ్రామ మాజీ సర్పంచ్ నునావత్ శ్రీనివాస్‌నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. శ్రీనివాస్ ఇద్దరి పిల్లలకు ఉచిత విద్య అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సురకంటి సత్తిరెడ్డి, పంజాల రామాంజనేయులు గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బాలకృష్ణ గౌడ్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛదనం – పచ్చదనంలో భాగస్వాములు కావాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేటలో కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

రామన్నపేట, ఆగస్టు 6 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంగళవారం చెక్కులు పంపిణీ చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిలో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలో స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల పచ్చదనం, ఆక్సిజన్ పెంపొందుతుందన్నారు. విరివిగా మొక్కలు నాటి భావితరాలకు వాతావరణ సమతుల్యతను అందించాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సురిగిరెడ్డి మల్లారెడ్డి, నాయకులు రాజిరెడ్డి, ప్రభాకర్, జగన్మోహన్, కృష్ణయ్య, శిరీష, నర్సిరెడ్డి, చంద్రశేఖర్, అక్రం, వెంకటేశ్, జమీరొద్దీన్, రమేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 6 : ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుగోడు నియోజకవర్గానికి సాగునీరు అందించే ఎస్ఎల్‌బీసీ, డిండి లిఫ్ట్ ప్రాజెక్టులను పూర్తి చేసి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలన్నారు. షరతులు లేకుండా లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని, 15ఎకరాల వరకు రైతుబంధు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని 255 సర్వే నెంబర్‌లో రైతులు సాగు చేసుకుంటున్న భూములను పోలీస్ బెటాలియన్‌కు కేటాయించవద్దన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శులు గోద శ్రీరాములు, నెల్లికంటి సత్యం, బచ్చనగోని గాలయ్య, నాయకులు శ్రీనివాస్, భాస్కర్, అంజయ్య, సంజీవ, సత్యం, యాదయ్య పాల్గొన్నారు.

యజ్ఞ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- పద్మశ్రీ